ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# బ్రహ్మర్షి డాక్టర్ ఆలీషా సాహిత్యం - ఆధ్యాత్మిక ,భక్తి సందేశం

**డాక్టర్ భూక్య తిరుపతి,**

అసోసియేట్ ప్రొఫెసర్,తెలుగు శాఖ,హైదరాబాద్ విశ్వవిద్యాలయం,

హైదరాబాద్.500046

**Article Received: 20/12/2024 Article Accepted: 16/01/2025 Published Online: 22/01/2025**

**DOI:10.53414/Sahithyatharangini.2025.2105**

**స్థూలాపరిచయం**:ఇంగ్లీషులో ఉన్న ఫిలాసఫీ అనే ఆంగ్ల పదానికి తెలుగులో సమానార్థకంగా తత్వశాస్త్రమని, ధర్మశాస్త్రమని, వేదాంతమని మానవ ఆలోచన శాస్త్రమని, నిర్వాణ సోపానలకు దారి తీసే శాస్త్రమని వివిధ రకాల పేర్లు వాడుకలో ఉన్నాయి.

మనిషి జీవన విధానం వాళ్ళ ఆలోచనలు, ఆశయాలు, ఆందోళనలు, పరిపాలన విధానం, మాటమర్యాదలు ఆచరించేటువంటి సంప్రదాయాలు, విలువలు, పూజించే దేవతలు, విద్యా విధానం,సమాజ నిర్మాణం విధానం, న్యాయం,ప్రాయశ్చిత్తం, పశ్చాత్తాపం, మనిషి యొక్క దయా గుణాలు, వ్యవసాయ ఆర్థిక రంగాలు, ఇవన్నీ జాతి సంస్కృతిలో ఉండే మౌలిక అంశాలు. వీటన్నింటిలోనూ తత్వశాస్త్రము కనిపిస్తూ ఉంటుంది. తత్వశాస్త్రం అంటేనే ఒక దర్శనం అంటే చూడడం అని మరో అర్థంలో మనం వాడవచ్చు. దర్శనానికి సంబంధించిన అనేక విషయాలు, విశ్లేషణలు, వేదాలలో కనిపిస్తాయి. వేదంలో చెప్పబడినటువంటి విషయాలు మనిషి జీవితంలో ఏదో ఒక సందర్భంలో కానీ అనుభవపూర్వకంగా తెలుసుకునే ఆవశ్యకత ఏర్పడుతుంది. ఒక విధంగా మనిషి ఒక పరిపక్వత చెందిన పరిణామ దశలోని వైవిధ్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకుంటూ ఉంటారు దాని యొక్క ప్రయోజనం ఏదో ఉంది అని ఆలోచించే విధానం కూడా ఇందులో కనిపిస్తూ ఉంటుంది.

**కీలకాంశాలు:** బ్రహ్మర్షి డాక్టర్ ఆలీషా సాహిత్యం - ఆధ్యాత్మిక , భక్తి సందేశం-విశ్లేషణ

ప్రతి దర్శనం ఆత్మను నిరూపించడానికి ఎంతో కృషి చేస్తుంది. మంచి స్వభావాన్ని ,ఆత్మ ఉనికిని, ఆత్మకు శరీరానికి ఉన్న సంబంధాన్ని గురించి మరణానంతరం ఆత్మ ఏమవుతుందో అనే విషయాన్ని గురించి అనేకమైన చర్చలు వాటికి సంబంధించిన రచనలు ఉన్నాయి. అవి వేదాలు కావచ్చు, ఉపనిషత్తులు కావచ్చు, భగవద్గీత కావచ్చు,

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

పురాణాలు కావచ్చు పురాణ ఇతిహాసాలు కావచ్చు, ఈ గ్రంథాలన్నింటిలోనూ ఈ విషయాలకు సంబంధించినటువంటి అంశాలు మనకు కనిపిస్తాయి.

మనిషి భౌతిక ప్రపంచాన్ని గురించి మనం తెలుసుకునేదంతా మానసిక ప్రపంచంలో ఉంటుంది. కనుక మనిషి మనసుకు ప్రాముఖ్యత ఇవ్వడం కనిపిస్తుంది. ఆధ్యాత్మిక సత్యాలను మానవుడు తెలుసుకోగలరు. పరమార్థాన్ని తెలుసుకోవడం అనేది ఎట్లా ఇటువంటి ప్రశ్నకు సమాధానం అంత తేలికైనది కాదు. ఈ ప్రశ్నకు ఉన్న సమాధానాన్ని పరిశీలిస్తే భారతీయ దర్శన శాస్త్రం దాని ఆవిర్భావంలో ఉన్నటువంటి వివిధ శాఖలుగా ఏ విధంగా ఉన్నాయనేది పరిశీలించవలసిన అవసరం ఉంది. దేవుని దర్శించుకునే విధానం జపం కావచ్చు, భక్తి పూర్వకమైనటువంటి పూజా కావచ్చు, భగవంతుని ధ్యానిస్తూ ఉండడం కావచ్చు భగవంతునితో తను చెప్పుకునేటువంటి విధానంలో కూడా దర్శనం కల్పిస్తుంది.ప్రతి దర్శనం ఆత్మను నిరూపించడానికి ఎంతో కృషి చేస్తుంది శుభస్వరూపాన్ని ఆత్మ ఉనికిని ఆత్మకు శరీరానికి ఉన్న సంబంధాన్ని గురించి మోక్షం మోక్షం ద్వారా పూర్తిగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.భారతీయ సంప్రదాయం నాలుగు రకాలైన పురుషర్థాలను గుర్తించింది. అవి ధర్మం, అర్థం, కామం, మోక్షం. కొన్ని దర్శనాలు కేవలం మోక్షానికో నిర్మాణానికో ప్రాముఖ్యమిస్తాయి. ఈ ప్రపంచమంతా దుఃఖమయం కాబట్టి దుఃఖం నుంచి బయటపడి సమాజానికి ఒక సందేశాన్ని ఇచ్చినటువంటి వ్యక్తి బుద్ధుడు కనిపిస్తాడు అయితే ధర్మశాస్త్రకర్తలు నీతి శాస్త్రవేత్తలు ధర్మం చాలా ముఖ్యమన్నారు మానవ నైజం సమస్తమైన ధర్మసాధనలకు మూలం అర్థం.

ఈ సృష్టిలో ఉన్న సమస్తమైన జీవరాసులు భగవంతుని ఆధీనంలో ఉంటాయి.అన్ని జీవరాసులలో భగవంతుడు అంతర్యామిగా ఉంటాడు. భగవంతునికి ఏ ప్రాణం మీద ద్వేషము ఉండదు. ఆయన సర్వ ప్రాణులకు మిత్రుడు. భక్తుడు, భగవంతున్ని వివిధ రకాలుగా పూజిస్తూ ఉంటాడు. భగవంతుని యందు మనసును బుద్ధిని ఉంచినటువంటివాడు ఆయనకు ప్రియమైనటువంటి భక్తుడు. భక్తులకు సంసారం అనేది ఒక సాగరంలో ఉంటుందని భగవంతుడే భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధిస్తాడు.లోక రక్షణకై అవతార పురుషులు, మహా పురుషులు, జన్మిస్తూ ఉంటారని భగవద్గీతలో చెప్పబడింది. ప్రపంచంలో పుట్టిన మహా ప్రతిభావంతుల్లోనూ, మహా జ్ఞానుల్లోను భగవత్వాదులు కలిగినటువంటి మహనీయులు ఉంటారు.

'భజ్'అనే ధాతువు నుంచి భక్తి అనే పదం ఉద్భవించింది. వేదమంత్రాలలో భక్తి శబ్ద ప్రస్తావన కనిపిస్తుంది.భగవంతుని పూజించమని, భగవంతున్ని సేవ చేయమని ఋగ్వేదంలో పేర్కొనబడింది. ఏ జాతి ప్రజలు ఏ దేవతను ఆరాధిస్తారో ఆ దేవుని పూజిస్తారు. వారి గురించి యజుర్వేదం చెబుతోంది. ఉపాసన అంటే సమీపంలో కూర్చోవడం అని అర్థం కనిపిస్తుంది. అయితే ఇక్కడ దేనికి సమీపంలో కూర్చోవాలి అనే ప్రశ్న కూడా వస్తుంది. అంటే దీని అర్థం భగవంతుడుకి దగ్గరగా కూర్చోవడం అనే

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

సమాధానం కూడా మనం చెప్పవచ్చు. వ్యాకూలతలేని మనసుతో నిరంతరం భగవంతుని దివ్య నామాన్ని మనసులో నింపుకొని ఆరాధించడమే భక్తి అని భగవద్గీత చెప్తుంది. " భారతీయ భక్తి సంప్రదాయం చాలా విలువైనది చరిత్రకు అందిన వారు, చరిత్రలో స్థానం పొందని వారు అనేకమంది మహా భక్తులు జన్మించిన భూమి భారతావని. ఉదాహరణకు వ్యాసుడు, నారదుడు, తుంబరుడు, ప్రహ్లాదుడు, భీష్ముడు సంజయుడు, బుద్ధుడు, కుచేలుడు, బలి చక్రవర్తి, హనుమంతుడు, విభీషణుడు, సుగ్రీవుడు, మొదలైన వారు పురాణ పురుషులు. అలాగే మహా భక్తులు తుకారాం, కబీర్ రామదాసు, తులసీదాసు, కనకదాసు, ఆండాలు నాయనార్లు, ఆల్వార్లు మహా భక్తులు" . (గూడ సుందర్రామయ్య, పుట:151, 1998).

తెలుగు ప్రజలు అనేకమంది క్రీస్తుపూర్వ కాలం నుండి తత్వశాస్త్ర అభివృద్ధికి కృషి చేశారు. తాత్విక అభివృద్ధికి, ప్రగతికి వాళ్ళు చేసిన కృషి ఎంతో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రాచీన కాలం నుండి ఆధ్యాత్మిక చింతనకు నైతిక విలువలను పెంపొందించడానికి ప్రజల్లో భక్తి భావాన్ని కలగజేయడానికి తెలుగు ప్రజలు చేసిన కృషిని పరిశీలిస్తే చారిత్రకంగానూ, సాహిత్య పరంగాను కనిపిస్తుంది . తెలుగు ప్రజల తాత్వికత అనేది సాహిత్యంలోనూ సంగీత సాహిత్యంలోనూ వివిధ రకాల కళల్లోనూ ఎల్లప్పుడూ ముందంజలోనే ఉంటారు. వారు చేసినటువంటి సాహిత్య కృషి చాలా గొప్పది. క్రీస్తు శకం ఒకటో శతాబ్దంలో తెలుగు నేలను పరిపాలించినటువంటి అనేకమంది రాజుల కాలం నుండి నేటి వరకు వివిధ మతాలు జైనం, బౌద్ధం మతాలు ఉండేటివి. కానీ నన్నయ భారతంద్రీకరణ కాలంలో హిందూమతం ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నది. నన్నయ యుగం నుండి హిందూ మత రచనలకు స్వర్ణ యుగం గా చెప్పవచ్చు. నన్నయ యుగం, శివకవుల యుగం, తిక్కన యుగం, ఎర్రన యుగం, శ్రీనాధుని యుగం లో ఉన్న ఇద్దరు ముఖ్యమైన కవులు శ్రీనాధుడు పోతన భక్తినే ప్రధానంగా ఎంచుకొని రచనలు చేసినటువంటి యుగంగా చెప్పవచ్చు. అలాగే ప్రబంధ సాహిత్యంలో ఉన్నటువంటి అష్టదిగ్గజ కవులు కూడా భక్తినే ప్రధానంగా చేసుకొని ప్రబంధ రచనలు చేశారు. దక్షిణాంధ్ర యుగంలోనూ మనకు భక్తికి సంబంధించినటువంటి రచనలు కనిపిస్తాయి. ప్రాచీన సాహిత్య కవులలో వైష్ణవ, శైవ మతాలకు సంబంధించినటువంటి రచనలు చేశారు.

ఉమర్ ఆలీషా (1885-1945) మధ్యకాలంలో జీవించినటువంటి ప్రముఖ సాహితీవేత్త, సంఘసంస్కర్త ,వేదాంతవేత్త, తన మాతృభాష తెలుగు కానప్పటికీ తెలుగులో అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించినటువంటి మహాకవి ఇతను ఆధ్యాత్మిక పీఠాధిపతి అయినప్పటికీ, ఆధ్యాత్మిక తత్వానికి కట్టుబడకుండా, సమాజంలో ఉన్నటువంటి అనేక సమస్యల మీద కవిత్వం సృష్టించారు. జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు, శాసనసభలో ప్రజా ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. మానవతావాది,

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

బహుముఖ ప్రజ్ఞావంతుడు. తెలుగు సాహిత్య ని సృష్టించిన ముస్లిం కవులలో అగ్రగన్యుడు ఉమర్ అలీషా గారు.

వీరి పూర్వీకులంతా వేదాంత పండితులు తత్త్వవేత్తలుగా, కవులుగా, గురువులుగా సుప్రసిద్ధులు అయినటువంటి వారు. వీరి పూర్వీకులు ఆధ్యాత్మిక జ్ఞాన ప్రచారం కోసం 1472లో శ్రీ విజ్ఞాన విద్యాధ్యాత్మిక పీఠాన్ని స్థాపించారు. ఈ పీఠం ద్వారా ధార్మిక విజ్ఞాన ప్రచారం చేస్తూ, ఆధ్యాత్మిక సేవకు తమ జీవితాలను అంకితం చేశారు. ఉమర్ అలీషా గారు 1885 ఫిబ్రవరి 28న మౌల్వీమొహిద్దీన్ బాద్షా, చాంద్ బీబీ దంపతులకు తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంలో జన్మించారు. మీరు చిన్నతనం నుండి తన కుటుంబంలో ఉన్నటువంటి సాహిత్య, సారస్వత, ధార్మిక సేవా కార్యక్రమాలలో పెరిగినటువంటి వ్యక్తి. అందుకే చిన్నప్పటినుండి వీరికి అన్ని రకాల శక్తి సామర్థ్యాలు ప్రజ్ఞాపాటవాలు అలవడ్డాయి ఇతను ఎనిమిదో సంవత్సరంలో అశువుగా కవిత్వం చెప్పి పండితులను గురువులను ఆశ్చర్యపరిచినటువంటి వారు.పిఠాపురంలోప్రముఖసంస్కృతాంధ్ర భాషా పండితుల వద్ద శిష్యరికం చేశారు. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ భాషలు నేర్చుకున్నారు. చిన్నతనంలోనే పలు భాషలలోపాండిత్యంసంపాదించినటువంటి వ్యక్తి 14 సంవత్సరాల వయసులోనే చందోబద్ధంగా తెలుగులో పద్యాలు రాయడం ప్రారంభించారు.

వీరు చిన్నతనంలోనే తన ఇంట్లో ఉన్నటువంటి తన పూర్వీకులు సృష్టించినటువంటి సాహిత్య సంపదను చదివి, వారి మార్గాన్ని అనుసరించారు. అలాగే ప్రపంచ భాషలలోని ఆధ్యాత్మిక సాహిత్య గ్రంథాలను చదివి వాటిని అధ్యయనం చేశారు . ఈ విధంగా సాహిత్య ప్రక్రియల మీద పట్టు సాధించారు. ఉమర్ అలీషా గారు 50 రచనలు చేశారని మరికొందరు 108 గ్రంధాలు రాశారని అభిప్రాయపడ్డారు. కానీ ఆయన రాసినటువంటి గ్రంథాలు మొత్తం 23 మాత్రమే లభ్యం. తను ఏ సాహిత్య ప్రక్రియలో రచన చేసిన పండితులతో పాటు, ప్రజల అభిమానాన్ని చురగొన్నారు. తన రచన ద్వారా ఏదో ఒక సామాజిక, ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని ఆశించి ఆ లక్ష్యసాధన దృష్టితో ఆ దిశగా రచనలు చేసేవారు. వాటిలో జాతీయ భావం, సమానత్వం, సర్వ మానవ సౌభ్రాతృత్వం, సర్వమత సమభావాలతో పాటుగా అనేక సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా, మహిళ అభ్యుదయాన్ని కాంక్షించి రచనలు చేసినటువంటి మహనీయుడు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు స్త్రీల గౌరవం కోసం స్త్రీలు స్వయంగా పాటుపడాలని తన గ్రంథాలలో పాత్రలచేత తన అభిమానాన్ని చాలా బలంగా చెప్పించారు. వీరి రచనలు ప్రధానంగా నాటకాలు, ఏకాంకికలు, ప్రహసనం, పద్యరచనలు, నవలలు, కథలు అనువాదాలు, వైద్య గ్రంథాలుగా వర్గీకరించవచ్చు. ఈ పద్య గ్రంథాలలో ప్రధానంగా ఖండకావ్యాలు తత్వ సందేశాలు, సూఫీ వేదాంత దర్శనం లాంటి రచనలతో పాటు వీరి రచనల్లో తత్వ సందేశాన్ని బోధించే రచనలు ప్రధానంగా తత్త్వ సందేశ కీర్తనలు, అలాగే స్వర్గమాత

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

అనే గ్రంథంలో ఉన్న తాత్త్వీక అంశాలను పరిశీలిస్తే, సమకాలీన అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి.

తత్త్వ సందేశం కీర్తనల్లో వీరు ఇలా అంటారు
"చంద్రుడెవరు చుక్కలెవరు
ఇంద్రుడెవరు ఈశుడెవరు
ఇంద్రియంబులు కట్టిచూచితే
యిన్నితానై యుండలేద"
…………………………..
అంటూ ఒక తాత్త్వికమైనటువంటి ఆలోచనను తెలియజేశారు.
"విరులు కరముల తెండో తరియింప
మీ హృదయ సరసి లోపల త్రెంపి
తెఱచి యున్నది స్వామి. పరమార్థ మందిరం పరుగు జ్ఞానపు దీపపంక్తి తమమును బాప
కరుణారసం వెల్లివిరిచున్నది"

ఇందులో జనన మరణాలు అనే సముద్రాలను దాటుటకు మీ హృదయమనే సరస్సు లోపల ఉన్న పువ్వులను తెంపి చేతుల నిండుగా తీసుకుని వచ్చి పూజించండి. తేజస్సును ప్రసరింప చేయు జ్ఞానం అనే దీప సముదాయం అజ్ఞానం అనేడు చీకటిని పోగొట్టడం కొరకు, స్వామి మోక్షమందిరం తెరిచి ఉన్నది. చీకటిలో వెతుకులాట ఎందుకు? భరింపరాని కష్టాలలో చిక్కుకొని మాయ అనే సముద్రం దాటి అవతలి ఒడ్డును చేరుకోలేరన్నారు. శాశ్వతమైన ఈ జ్ఞాన ప్రకాశమనెడి నావ ఎక్కినట్లయితే, ఆ మాయసముద్రమును దాటగలరు. మీ హృదయమనేని సరస్సు లోపల ఉన్న సద్భావాలను తెంపి తీసుకొని వచ్చి పూజించండి. ఓ స్వామి ఈ భూమండలంలో సమస్తాన్ని పాలించే చక్రవర్తివి నీవు. ఈ భూమిలో ఉన్న వారందరిలోను కడు నిరుపేదను నేను. అట్టి నేను నీకు ఏమియ్యగలను నివేదనం అనే మరో కీర్తనలో లో తెలియజేశారు.

తత్త్వం అనే కీర్తనలో
" వెర్రులై తిరిగేదరు జనులార
నిజమింత దెలియక వెర్రులై తిరగెదరు జనులార
మర్రి కిరువది యైదుకొమ్మలు
తొర్రలారయ తొమ్మిదున్నవి
సర్రు సర్రున తిరుగు పక్షి
తుర్రుమని పోతేను మిథ్య
ఏడుకొండల చుట్టి కుండలి
పాడుచున్నది ప్రణవనాదము
తోడనే మనసనేడు చేటిక
యాడుచున్నది జీవనాటిక"

ఓ ప్రజలారా మీరు నిజమును నేనే బ్రహ్మనను నిజమును, కొంచెం కూడా తెలుసుకొనకుండ అవివేకులై తిరుగుతున్నారు. శరీరమందు 25 తత్త్వలు 9 రంధ్రాలు ఉన్నవ. అందులో సర్రు సర్రున తిరిగే ప్రాణం అనేటి పక్షి హఠాత్తుగా ఎగిరిపోతే మీరు శాశ్వతులు అనుకునే మీ భావం అసత్యమని అంటారు.

కలిసంహారం అనే కీర్తనలో
రారేమి అక్కలారా
ద్వారాలు తీయరేలా
క్రూరుడా కలి కల్కికి ప్రారంభమయ్యే
పోరు మిన్నులు ముట్టగా
నిప్పులు గూరిసె నభము…
ఈ కల్పమంతమొందు
ఆ కల్కి రాజ్యమందు
శ్రీ కై ఉంరలిషా కవి
కా ఖైదీలు
డీ కథారాథము చెప్పును అని అంటారు

ఓ అక్కలారా కఠిన మనస్కుడైన ఆ కలిపురుషునికి, కల్క్యవతారికి ఆకాశం తాకునట్లుగా యుద్ధము మొదలైంది. ఇంకా మీరు తలుపులు తెరిచి రావడం లేదేమి? నదులన్నీ పొంగినవి. ఇక ముందు ఊళ్ళని మునుగుతాయి. అటువంటి పరిస్థితులలో బయటపడటానికి బండ్ల బాటలు కనబడతాయ కావున ఊర్లు మునగకముందే బండ్ల బాటలను స్పష్టంగా చూసి బయటకు వెళ్ళండి. ఈ కల్పం అంతమైపోతుంది. ప్రళయం తర్వాతే ఆ కల్క్యవతారి రాజ్యంలో సకల సంపదల ప్రాప్తికై, ఆ ఖైలలీషుడు ఈకవికి ఈవిషయం వివరించెను.

హారతి అనే కీర్తనలో
"హారతి జయ జయ హారతి
శ్రీ గురుదేవా హారతి
గైకొనుము స్వామి
నీ రాజనములు నీ పేరుపేరునా గూర్చి ఆరాధించు భక్తి నర్పించు కర్పూర
పరమ భక్తులు జ్ఞానభరిత సాధ్వీమణులు కరములు మోడ్చి యీవిరి పళ్లెరమునసీచ్చ
పరతత్త్వతేజమున వరములు మాకిచ్చి యరయు మమరలీషాను నరిసినట్లులనిదిగో".

గురుదేవా హారతిని సమర్పిస్తున్నాను జయ జయ అని సమర్పించు ఈ హారతిని స్వీకరించు స్వామి మీ ప్రతి పేరును తలుచుకొనుచు ధూప దీప నైవేద్యం అర్పించుచు, ఆరాధించుచు భక్తితో సమర్పించే, కర్పూర హారతిని స్వీకరించు స్వామి అని తెలియజేస్తున్నాడు.

నిరాశ కీర్తనలో
"ఎవ్వరికి లోకమందు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఎప్పటికి ఏమి గలదో
ఎవరికి ఏమి ఎరుక
ఎరుక చెప్పేవారు కలర……..
కలిమి ఎల్లకాలం ఉండి కాలమునకు పనికిరాదు తెలిసి ఉమరాలిషా కవి
తెలియజెప్పెను తెలుసుకొనుడీ".

ఈ లోకంలో ఎవరికి ఏ సమయంలో ఏమి కలుగుతుందో ఎవరికి ఏమి తెలుస్తుంది? అటువంటి జోస్యం చెప్పే వారెవరైనా ఉన్నారా? ఆ జ్ఞానాన్ని బోధించి ఆ రహస్యాన్ని విప్పి చెప్పే వారెవరైనా ఉన్నారా? అలాగే సంపద ఎల్లవేళలా ఉన్నప్పటికీ అవసర కాలమునకు పనికిరాదని కవి ఈ విషయాన్ని లోకానికి తెలియజేస్తున్నాడు. జీవుని కథనం అనే ఈ సంకీర్తనలో జీవుడు ఆ విరాట్ అనే పరమ పురుషుని నుండి ఆనాడు విడువడి పుట్టి, మానవరూపం పొందగ, చావు పుట్టుకలనేవి రెండు విధముల లోనే పడిపోయి, అజ్ఞానమను చీకటి ఒకటియే స్థానమగునట్టి ఈ శరీరమే తాను అని అనుకునే జీవన కథనాన్ని తెలియజేస్తున్నాడు. ఈ పంచభూతాలలో అంతర్లీనంగా ఇమిడిపోయి ఉన్న శబ్దం మొదలైన ఇంద్రియ విషయాలను, ఈ ప్రపంచంలో జన్మించి పవిత్రము శాశ్వతమైన పరమాత్మ స్వరూపాన్ని పోగొట్టుకొని ఏదో ఒక జన్మ నెత్తి కాపురం చేస్తూ, భార్య సంతానములనేడు తాపత్రయాలలో చిక్కుకొని తుదకు ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని మహాపదార్థాన్ని మరిచి తిరిగాడుతున్నాడు. 36 తత్త్వలకు మించి ఉన్న ఓంకార రూపమైన ఆకారమే ఈ జీవుడు విషయాన్ని ఇందులో తెలియజేశారు.

అలాగే ఇందులో ఓ కారుణ్య గణ్య శరణ్య, మానవ జీవితం, ఇదిగో పువ్వులు స్వామి, వచ్చి వచ్చేదాక, నినుగనుగొన నా మనము తపించే, తత్త్వ సందేశము, లాంటి కీర్తనలు వర్తమాన సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చే సంకీర్తనలు అని చెప్పవచ్చు.

స్వర్గమాత అనే కందార్థములు గల కావ్యంలో రచయిత ఐహికనిరసనము అనే ఖండికలో "బ్రతుకనునది క్షితి పై మన కతి యల్పమునందలి తామరాకునందలి జలమ ట్లలితము మేఘంబుల గతి ప్రతి నిమిషంబు మారు……"
ఈ భూమిపై బ్రతుకు అనేది చాలా అల్పం తామరాకునందలి నీటివలే మిక్కిలి చంచలమైనది. అంటే తామరకం మీద ఉన్న నీటి బొట్టు అతివేగంగా కదిలి జారిపోవు విధంగా ఈ భూమి పైన ఉన్న మన బ్రతుకు కూడా చాలా తొందరగా నశించును. అలాగే ఈ బ్రతుకు మేఘాల వలె ప్రతి నిమిషము మారుచుండును. కనుక కాలంను వృధాగా గడిపిన వారికి పరమాత్మను చేరు మార్గాలు లేవు. అట్టి జీవి తనను తాను తెలుసుకున్నచో బుద్ధిమంతులై, శాశ్వతమైనట్టి పుణ్య స్థానం కొరకు ప్రయత్నించడం మంచిదని రచయిత అభిప్రాయం. అలాగే "ధనవంతులు మదవంతులు జగపత్తులై కీర్తి గన్న సాములు కుజనుల్

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

చనినారు విడిచి సర్వం
మనమా శాశ్వతము పుణ్య
మార్గము కొరకు వెదకుట మేలు స్వర్గము కొరకు...."

ధనవంతులు, గర్విష్ఠులు, పరిపాలకులై కీర్తి గాంచిన రాజులు,దుర్మార్గులు అందరు కూడా అన్నింటిని ఈ లోకంలోని విడిచిపెట్టి వెళ్లిపోయారు. అటువంటప్పుడు మనం మాత్రం శాశ్వతమా ? కనుక పుణ్యమార్గం కొరకు వెతికి ఆ మార్గంలో పయనించి స్వర్గం కొరకు వెతుకుట మేలు. కర్మలు నశింప చేసుకొని మరణించిన మోక్షం సిద్ధిస్తుంది అని తెలియజేస్తున్నారు.

"నరులకు నాయురార్ధము సరిగా నింతనుచు చెప్పజాలము సుడిలో
దిరిగెడు నాకులక్రైవడి
దిరుగుతూ రోగముల చేత
ద్రెళ్లి పోయెదరు పేదరికంచే.
నల్లలాడెదరు......"

మానవుల ఆయుషు సరిగా ఇంత అని చెప్పలేము. సుడిగాలిలో తిరిగే ఆకులవలే రోగములు చేత పడిపోయేదరు. పేదరికంచే కష్టాల మధ్య బాధపడేదరు. మాయా జగతిలో తల్లడిల్లి పోతూ ఉంటారు. ఈ జగత్తు వల్ల పొందే సౌఖ్యమంతయు వ్యర్థమైనది భ్రాంతి రూపమైందని తెలియజేస్తున్నారు.

ఈశ్వరుడు అనే ఖండికలో "అడవిని తరువులు మృగములు జడధిని మత్స్యములు మణులు సచరాచరమున్ బుడమియు సర్వేశ్వరు మది నిడికొని పూజించు మనజు" అడవిలోని చెట్లు, జంతువులు, సముద్రంలోని చేపలు, మణులు ఇంకా కదిలేవి, కదలకుండా ఉండేవి అన్ని, ఇంకా భూమి కూడా ఆ సర్వేశ్వరుని మనసులో పెట్టుకుని పూజించుచున్నవి. మనిషి ఒక్కడే అజ్ఞానంతో భగవంతుని సేవించడం లేదు. అన్ని గొడవలను పక్కనపెట్టి సద్గురువును ఆశ్రయించి జన్మరాహిత్యం చేసుకొనవలెనని ప్రయత్నం మనిషి ఎందుకు చేయడం లేదని తన ఆవేదనను తెలియజేస్తున్నాడు.

"ఏ వస్తువుచే నేద్రై
భూవలయమునందు బుద్ధి బొడమునో యది యా
యా విద్య చదువకుండగ
కేవల పామరులు చెప్పి
గెలిచిపోగలరా! నేర్వక వీణ పలికింపగలరా
అలరునీశ్వరచైత!న్యము చేత జగ మెల్ల చలియించు నా యెఱుక దెలియ వారె గాని"

ఈ భూగోళమందు ఏ కారణము చే ఏ కార్యం జరుగుతుందో అనే జ్ఞానాన్ని కలిగించే విద్యను నేర్చుకోకుండా కేవలం అజ్ఞానులు తత్త్వమును చెప్పి విజయం సాధించగలరా? నేర్చుకోకుండా వీణతో స్వరాలు పలికించగలరా ?ప్రకాశవంతమైనటువంటి ఈశ్వర చైతన్యముల వలన ఈ జగత్తు నడుస్తున్నది అన్న జ్ఞానం కలవారే విజయాన్ని సాధిస్తారని తెలియజేస్తున్నాడు రచయిత .

మరో పద్యంలో ఆలీషా గారు ఇలా అంటారు
"తొలుత గుణంబులు పట్టగ
వలయును నా వెనుక సత్య వాక్యము లేపుడున్
బలుకగ నేర్వగ వలయును
కలుషంబులు గలుగు పనులు గావింపవలదు పర ధనములను గామింపజనదు
ఆ వెనుక సాధింప గా వలయుతత్త్వము చావు పుట్టుక లేని తావు వచ్చును చెడ్డ".

భక్తుడు అనేటువంటి వ్యక్తి ముందుగా త్రిగుణాలను అదుపులో ఉంచుకున్న తర్వాత ఎల్లప్పుడూ సత్యాన్ని పలకాలి. సత్యాన్ని పలకడమే కాకుండా, పాప పనులు చేయకూడదు. ఇతరుల ధనాన్ని ఆశించకూడదు. వీటి తరువాత తత్త్వాన్ని సాధించినట్లయితే, చావు పుట్టుక లేని పరంధామమును చేరుకోవచ్చును. అలాగే ప్రతి భక్తుడు చెడ్డ పనులు చేయరాదని రచయిత అభిప్రాయం.

భగవంతుని మీద భక్తి లేని మనిషి భూమిపై ఉన్న సర్వజ్ఞులైన రాజులు కావచ్చు, పండితులు, మహా పండితులను కావచ్చు ఉపయోగం లేదు. మానవులు భగవంతుని యందు ఎల్లవేళలా భక్తి మాత్రమే ఉన్నటువంటి వ్యక్తి దేవునిలో లేనమైపోతాడు. గర్విగా ఉన్నటువంటి వ్యక్తికి, ఈ భూమి స్థలమేమీ ఇవ్వదు మీరందరూ ఈ తత్త్వాన్ని అర్థం చేసుకోవాలి.

**ముగింపు:** శరీరం శాశ్వతమని దానికి ఎటువంటి ప్రమాదం లేదని మాయలో పడిపోకు. లోక విషయాల నుండి మనసుమరలిన పుణ్యసంపదలు, మోక్షము మహా జ్ఞానం అనే విజయ కీర్తి చేకూరుతుంది. మోక్షము మహా జ్ఞానం అనేది విజయ కీర్తి రాతలు నీకు వేరే ఆలోచన ఉండకూడదు. అటువంటి జ్ఞానికి సద్గుణ తేజ మూర్తిగా విలసిల్లు కీర్తి రాగలదు. నేను నాది అనే భావాన్ని అహంకారాన్ని క్రమంగా విడిచిపెట్టిన వాడు మాత్రమే జ్ఞాని. మూడత్వంలో చిక్కిన వాడు వేద వేదాంతాలను గొంతు ఎత్తి చెప్పినప్పటికి కూడా ప్రయోజనం ఉండదు. ఏ కొంచమైనా యధార్థమైన చదువు నేర్చి పరమాత్మను ఒకే మారు దర్శించిన చాలు అని చెప్తున్నారు రచయిత. అజ్ఞానులు ఎల్లప్పుడూ నీతి తప్పి వ్యవహరిస్తుంటారు. నల్లని మబ్బులోని మెరుపువలే జీవితం క్షణికమని ఆలోచింపక నీతి లేకుండా మాట్లాడుతుంటారు. ఏ మనిషికైనా యోగభ్యాసం చేత మోహము, శత్రుత్వం,

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

రెండూ స్థాయి చెంది శాంతి లభిస్తుంది. ఈ స్థితి వైరాగ్యం చేత లభిస్తుంది. వైరాగ్యం లేకున్న ముక్తి రానే రాదు ముక్తి అన్నది ఏదో వట్టి మాట కాదు. జ్ఞానము అల్ప ధ్యానంతో లభించేది కాదు. అనేక ప్రయత్నాలతో ఇంద్రియ నిగ్రహం సాధిస్తే గాని ముక్తి లభించదు. ప్రకాశ స్వరూపుడైన భగవంతుని స్మరిస్తూ, ధర్మ మార్గంలో నడుస్తూ, మోక్షానందాన్ని పొందడానికి కావలసిన అర్హతలు సంపాదించుకోవాలి. ప్రతి వ్యక్తి భగవంతుని గురించి జీవ ప్రకృతి గురించి తెలుసుకొని జీవించాలని ఆలీషా గారు తమ రచనల ద్వారా సమాజానికి తెలియజేశారు.

**ఆధార గ్రంథాలు:**

శ్రీ ఉమర్ ఆలీషా మహాకవి షష్ఠ పీఠాధిపతి,తత్త్వ సందేశము( కీర్తనలు). శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక
పీఠం, పిఠాపురం, తూర్పుగోదావరి. జిల్లా,2017.
శ్రీ ఉమర్ ఆలీషా మహాకవి షష్ఠ పీఠాధిపతి,స్వర్గమాత. శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం,
పిఠాపురం,తూర్పుగోదావరి జిల్లా.2016.
గూడ సుందరరామయ్య, భారతీయ తత్వశాస్త్రం సమగ్ర పరిశీలన, తెలుగు అకాడమీ హైదరాబాద్ 1998.
సి నారాయణ రెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిక్ సింగ్
హౌస్ హైదరాబాద్, 1999.
జి.వి. సుబ్రహ్మణ్యం, సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, తెలుగు అకాడమీ 2005.
మసన చెన్నప్ప, ఉపనిషత్తులు-దర్శనాలు, ప్రమీలా శక్తిపీఠం ప్రచురణ, హైదరాబాద్,2023.
మసన చెన్నప్ప, వేదాలు -వేదాంగాలు, ప్రమీలా శక్తిపీఠం ప్రచురణ, హైదరాబాద్2023.